క్లుప్తంగా

ధాన్యం కొనుగోలుకు చర్యలు

గుడివాడరూరల్: రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందని ఏఓ బోలెం అనంతలక్ష్మి అన్నారు. మండలంలోని మోటూరు, దొండపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అమోదయోగ్యంగా ఇబ్బంది లేకుండా గిట్టుబాటు ధర కల్పించి, ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లోని విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీ లక్ష్మీ గణపతి హోమం ఘనంగా నిర్వహించారు. 135 మంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ సంకష్టహరి చతుర్థి సందర్భంగా ఈ హోమం నిర్వహించినట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో చంద్రాల, విన్నకోట హైస్కూల్లో విద్యార్థులకు మంగళవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలను నిర్వహించారు. నర్రా గంగాధరరావు, నిర్మలాకుమారి దంపతుల ఆర్థికసాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారని లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి. ప్రసాద్ పాల్గొన్నారు.

పరిపాలనపై దృష్టిపెట్టండి



గుడివాడ టౌన్: ప్రతి పురపాలక సంఘంలోను పన్నుల వసూళ్లు, ప్రజలకు సేవలపై దృష్టిపెట్టాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నాగ నరసింహారావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశం హాల్లో గుడివాడ, పెడన, ఉయ్యూరు మున్సిపల్, మచిలీపట్నం కార్పొరేషన్ కమిషనర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో గుడివాడ, పెడన, ఉయ్యూరు, మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, గోపాలరావు, పి.వెంకటేశ్వరరావు, బాపిరాజు, అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కైకలూరు: గోనెపాడులో స్వయంభూ గంగా పార్వతీ సమేత శ్రీ జలలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం కార్తీక అన్నసమారాధన నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ కార్తీకమాస మహోత్సవాల్లో భాగంగా స్వామి జన్మ నక్షత్రం ఆరుద్ర సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 30న లక్ష బిల్వార్చన నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

బాలల హక్కులపై అవగాహన

మండవల్లి: మండలంలోని కానుకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ నాగలక్ష్మి బాల్య వివాహాలపై కలిగే అనర్థాలను వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పౌష్టికాహారంపై, చైల్డ్ హెల్ప్ లైన్ నెం.112, 118, 1098పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎంఎస్‌కేఎన్ తేజోవతి, ఏఎన్ఎం కమల పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మిర్యాలగూడ టౌన్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఆటోను ఢీకొని తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా నందివాడ మండలం అలిపిరాల గ్రామానికి చెందిన గోగులముడి తంబి(40) కొంతకాలంగా నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో గల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో వెల్డింగ్ పనిచేస్తూ స్థానికంగా రాశి సిమెంట్ ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 18వ తేదీన బైక్‌పై మిర్యాలగూడ పట్టణానికి వస్తుండగా.. మార్గమధ్యంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై మిర్యాలగూడ మండలం గూడూరు వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాలీ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తంబిని స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు విజయవాడలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆశల పోరుబాట

- గుడివాడ నియోజకవర్గంలో 3,400 మంది ఆశ వర్కర్లు
- వివిధ డిమాండ్లపై ప్రభుత్వంపై పోరాటం



ఆశ వర్కర్లు (ఫైల్)

గుడ్లవల్లేరు: ఆశ వర్కర్లు పోరుబాటలో ఉద్యమిస్తున్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు చేపట్టారు. గుడివాడ నియోజకవర్గంలో 3,400 మంది ఆశ వర్కర్లు ఉన్నారు. గ్రామీణ ప్రాంతంలో వైద్యం అనేది ఆశాలతోనే ప్రారంభమవుతుంది. ప్రసవాలు, ఇమ్యునైజేషన్, సర్వేలు, లెప్రసీ, మలేరియా, క్యాన్సర్ తదితర ప్రజల ఆరోగ్య సమస్యలకు ఆరోగ్య శాఖ వారు క్షేత్ర స్థాయిలో వెట్టి చాకిరి చేయించుకుంటున్నారే తప్ప తమకు వేతనాలకు వచ్చేసరికి అంతంతమాత్రంగానే ఉందని ఆశ వర్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆశ వర్కర్లకు నెలకు రూ.6వేలు ఉండే వేతనాన్ని ఒక్కసారిగా రూ.10 వేలు చేశారని వారు పేర్కొన్నారు. నెలకు రూ.26వేల కనీసం వేతనం ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లపై ఇప్పటికే డీఎంహెచ్ఓ కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాలను చేపట్టారు. కూటమి ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేయక తప్పదని హెచ్చరిస్తున్నారు.

ఆశ వర్కర్ల డిమాండ్లు ఇవి..

- ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రాత పూర్వకంగా ఇచ్చిన హామీలకు వెంటనే జీఓలు విడుదల చేయాలి.
- ఆశ వర్కర్లకు వెంటనే వేతనాలు పెంచాలి.
- రికార్డులతో పాటు నాణ్యమైన సెల్ ఫోన్లు, సిమ్‌లను ఇవ్వాలి.
- సాధారణ సెలవులు, మెడికల్ లీవ్‌లతో పాటు మెటర్నరీ లీవ్ కూడా ఇవ్వాలి.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి.
- 62 ఏళ్ల వయో పరిమితి పెంచాలి.
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఆశ వర్కర్లకు అమలు చేయాలి.
- ఆశ వర్కర్లపై అధికారులు వేధింపులు, బెదిరింపులను ఆపాలి.
- ఆశ వర్కర్ల నియామకాలను ప్రభుత్వమే చేపట్టాలి. రాజకీయ జోక్యం ఉండకూడదు.
- ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి.
- చనిపోతే మట్టి ఖర్చులకు ఇవ్వాలి.
- ఆశ వర్కర్లతో వారికి సంబంధం లేని పనులను చేయించరాదు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



మా సంఘ డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని స్పందించి మా కోర్కెలను తీర్చాలి. అలా తీర్చకపోతే 2025 ఫిబ్రవరి 4వ తేదీన సీఎం క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడించనున్నాం. ఇప్పటికే డీఎంహెచ్ఓ కార్యాలయంతో పాటు జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడి చేశాం. మా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం.

– చందన లక్ష్మి, ఆశ వర్కర్ల అసోసియేషన్ అధ్యక్షురాలు, గుడ్లవల్లేరు మండలం

వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలి



ఆశ వర్కర్లకు వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. ఆశ వర్కర్లపై అధికారులు వేధింపులు, బెదిరింపులను ఆపాలి. ఆశా వర్కర్ల నియామకాలను ప్రభుత్వమే చేపట్టాలి. రాజకీయ జోక్యం ఉండకూడదు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి.

– ఎస్.నీలిమ, ఆశా వర్కర్, గుడ్లవల్లేరు పీహెచ్‌సీ

వేతనాలు పెంచాలి



ఆశ వర్కర్లకు వెంటనే వేతనాలను పెంచాలి. ఆశ వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం రాత పూర్వకంగా ఇచ్చిన హామీలకు వెంటనే జీఓలు విడుదల చేయాలి. రికార్డులతో పాటు నాణ్యమైన సెల్ ఫోన్లు, సిమ్‌లను ఇవ్వాలి. సాధారణ సెలవులు, మెడికల్ లీవ్‌తో పాటు మెటర్నరీ లీవ్ కూడా ఇవ్వాలి.

– పి.తులసి, ఆశ వర్కర్, గుడ్లవల్లేరు పీహెచ్‌సీ

సంక్షేమ పథకాలు ఇవ్వాలి



ఆశా వర్కర్లకు వచ్చే వేతనాలు తక్కువ కావటంతో ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలను మా కుటుంబాలకు అమలు చేయాలి. ఆశా వర్కర్లతో వారికి సంబంధం లేని పనులను చేయించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఆశ వర్కర్ ఎవరైనా చనిపోయిన వెంటనే మట్టి ఖర్చులకు ఇవ్వాలి.

– ఐ.నాగలక్ష్మి, ఆశా వర్కర్, గుడ్లవల్లేరు పీహెచ్‌సీ

పారదర్శక పాలనకు అధికారులు సహకరించాలి

డీపీఓ అరుణ

పామర్రు: జిల్లాలో పారదర్శక పాలనకు అధికారులు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) అరుణ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అధికారులు, పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్ తదితర శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. తొలుత పామర్రు ఎంపీడీఓ జ్యోతి డీపీఓకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ పంచాయతీల ద్వారా నిర్వహించే అన్ని రకాల పనుల వివరాలను ప్రత్యేకమైన యాప్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పంచాయతీలకు కలిపి ఒక యాప్‌ను రూపొందించామని తెలిపారు. దీనిలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులు , అపరాధపు పన్నులు తదితరాల వివరాలను నమోదు చేయాలన్నారు. పంచాయతీ బోర్డు సభ్యుల పేర్లు వారి వివరాలను కూడా యాప్‌లో ఉంచాలని పేర్కొన్నారు. పంచాయతీలకు సంబంధించిన వేలం పాట వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కిషోర్, పలు గ్రామాల కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



డీపీఓ అరుణకు స్వాగతం పలుకుతున్న ఎంపీడీఓ జ్యోతి తదితరులు

ప్రజలకు సురక్షిత నీరు అందించాలి

క్వాలిటీ కంట్రోల్ డీఈఈ నరసింహారావు

గుడివాడరూరల్: గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ బీవీఎల్ నరసింహారావు అన్నారు. మండలంలోని చౌటపల్లి, మల్లాయపాలెం, కల్వపూడి అగ్రహారం, గుంటాకోడూరు, శేరీగొల్వేపల్లి, సైదేపూడి, దొండపాడు గ్రామాల్లో జరుగుతున్న ఫిల్టర్‌బెడ్‌ల మరమ్మతులను డీఈఈ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్యూసీ ఏఈఈ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు సమక్షంలో పనుల తీరును డీఈఈ పరిశీలించి పలు సూచనలు జారీ చేశారు. డీఈఈ మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలతో పనులు నిర్వహించాలన్నారు. పనులు పర్యవేక్షించి ప్రజలకు తాగునీరు అందించాల్సిన బాధ్యత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఉందన్నారు.



పంచాయతీ సిబ్బంది, అధికారులకు సూచనలు ఇస్తున్న డీఈఈ నరసింహారావు

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి తీవ్ర గాయాలు

గుడివాడరూరల్: మోటార్ బైక్ ఢీకొట్టిన సంఘటనలో ఓ చిన్నారి తీవ్ర గాయాలకు గురైన సంఘటనపై తాలూకా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు ఈ నెల 17వ తేదీన తటివర్రు గ్రామానికి చెందిన కలంకూరి సుధీర్‌బాబు, తన నాలుగేళ్ల కుమార్తె తన్వితో కలసి ఆటో ఎక్కేందుకు వెళ్తుండగా రోడ్డుపై వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం చిన్నారిని ఢీకొంది. ప్రమాదంలో చిన్నారి కుడి కాలు విరిగి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనాన్ని నడిపిన వ్యక్తి వాహనాన్ని ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు. చిన్నారిని చికిత్స నిమిత్తం గుడివాడ ఆస్పత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా బైక్ నడిపిన వాహన యజమానిపై చిన్నారి తండ్రి సుధీర్‌బాబు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ఎన్.చంటిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నరకానికి రహ‘దారులు’



శ్రీరామ్‌నగర్ వద్ద అధ్వానంగా మారిన రోడ్డు



నందిగామలంక వద్ద రోడ్డు దుస్థితి

మండవల్లి: మండలంలోని రహదారులు అడుగడుగునా గుంతలమయంగా మారి నరకానికి రహదారులుగా మారాయి. కొల్లేటి ప్రాంతానికి అతి కీలకమైన రహదారులు వర్షం వస్తే అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. శ్రీరామ్‌నగర్ నుంచి నందిగామ లంక మీదుగా పెనుమాకలంక వెళ్లడానికి రోడ్డు పరిస్థితి నరక కూపంగా మారింది. ఎన్నికల్లో గెలిచిన తరువాత రహదారులకు మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు దాని ఊసే మరిచారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ రహదారిని అభివృద్ధి చేసి ప్రాణాలు కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారింది

ఎన్నో సంవత్సరాలుగా పెనుమాకలంక రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు గుంతల మయమై ప్రమాదకరంగా మారింది. కొద్దికాలంగా ప్రమాదాల సంఖ్య పెరిగింది. రోడ్డును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలి.

– చొప్పరపు విచ్చేశ్వరరావు, మండవల్లి

సమాచారం ఇవ్వండి.. గోప్యంగా ఉంచుతాం

కైకలూరు: నియోజకవర్గంలో బెల్టు దుకాణాల వివరాల సమాచారం అందించే వ్యక్తుల పేర్లను గోప్యంగా ఉంచుతామని, సహకరించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఎస్‌కే రమేష్ ప్రజలను కోరారు. కైకలూరులో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడి చేసి, పేటేటి శ్యామలరావు అనే వ్యక్తి నుంచి ఏడు క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ఆదినారాయణ, అలీం, కానిస్టేబుల్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా కైకలూరు రూరల్ పరిధిలో ఆలపాడు గ్రామంలో మువ్వ నాగబాబు అనే వ్యక్తి నుంచి 11 క్వార్టర్ బాటిళ్లను రూరల్ ఎస్ఐ వి.రాంబాబు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కైకలూరు: బాల్య వివాహాలను అరికట్టేందుకు కలిసి కట్టుగా పని చేయాలని ఐసీడీఎస్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ ఎం.లావణ్య పేర్కొన్నారు. కైకలూరు ఎంపీయూపీ ఉర్దూ పాఠశాల్లో మంగళవారం కిషోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకుంటే ఆరోగ్యపరంగా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వీటిని అరికట్టడంలో అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర ముఖ్యమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈసా, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్ఎన్‌వీవీ గంగాజలం, ఎం.వెంకటలక్ష్మి, వి.లీలావతి, సీహెచ్ లక్ష్మి పాల్గొన్నారు.

లింగవరంలో సమస్యల తిష్ట

గుడివాడరూరల్: లింగవరం గ్రామంలో సమస్యలు తిష్టవేసి గ్రామస్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని సామాజిక కార్యకర్త ఎ.రవికిరణ్ ఆరోపించారు. గ్రామంలో ఉన్న సమస్యలను అధికారులు గాలికి వదిలేశారని, ప్రజలు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడ చూసినా రోడ్లపై చెత్తచెదారాలు కన్పిస్తున్నాయన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి సమస్యలపై ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

మాల మహానాడు పట్టణ అధ్యక్షుడిగా అనిల్

గుడివాడ టౌన్: మాల మహానాడు గుడివాడ పట్టణ అధ్యక్షుడిగా తంటెపూడి అనిల్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పొంగులేటి జయరాజు మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకుడు మెండా మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

అనుచితంగా ప్రవర్తించిన వారికి కఠిన శిక్ష

గుడివాడరూరల్: మహిళలపై లైంగిక దాడులకు పాల్పడిన, అనుచితంగా ప్రవర్తించిన వారిపై కఠినతరమైన శిక్ష విధిస్తారని గుడివాడ టూటౌన్ ఎస్ఐ జాస్మిన్ అన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని కేటీఆర్ మహిళా కళాశాలలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికల సంరక్షణకు శక్తి టీములను ఏర్పాటు చేశామన్నారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించి ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే శక్తి టీముకు సమాచారం అందించాలని కోరారు. కళాశాలలో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాలికలు, మహిళలు ఏ సమస్య వచ్చినా 112కు సమాచారం అందించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుష్మ, సెక్రటరీ నిర్మల, మహిళా కానిస్టేబుల్ స్వర్ణలత, స్వాతి పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో ఈ అభిషేకాలు నిర్వహించగా సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి పర్యవేక్షించారు.

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు

గుడివాడరూరల్: విద్యార్థులు చిరు ప్రాయం నుంచి అంకితభావం, పట్టుదలతో చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని మోటూరు జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సుబేదాబేగం అన్నారు. మండలంలోని మోటూరు గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాన్ని లైబ్రేరియన్ గొట్టిపాటి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకుడు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ గ్రంథాలయంలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



జమీగొల్వేపల్లిలో రంగ వల్లుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

గుడివాడ టౌన్: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమశ్రేణి గ్రంథాలయం, రాజేంద్రనగర్ లోని శాఖా గ్రంథాలయాల్లో మంగళవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గులాబ్‌చంద్ గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సుగుణ గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, వాటి గుర్తింపు, నివారణోపాయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బి.వెంకటరమణ, ప్రవల్లిక పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు, అంగలూరు గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు టి.వాణి, పి.వి.వి.పద్మజ పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థినులకు మంగళవారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయినులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు సమాజసేవలో'యువత భాగస్వామ్యం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

మహిళా సాధికారతపై అవగాహన

మండవల్లి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. డిజిటల్ లైబ్రరీ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ఎం.కొండలు మాట్లాడుతూ పిల్లలు తమ సమయాన్ని పాఠ్య పుస్తకాలు చదవడానికి కేటాయించాలన్నారు. అనంతరం గ్రంథాలయంలో మెంబర్‌షిప్‌నకు 40 మంది పిల్లలకు కార్యదర్శి రూ.2 వేలు అందజేశారు. గ్రంథాలయాధికారి షేక్ పర్వీన పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక జిల్లా గ్రంథాలయంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఝాన్సీరాణి బాలికలకు రంగ వల్లుల పోటీలను నిర్వహించారు.

జమీగొల్వేపల్లిలో..

మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లిలో శాఖా గ్రంథాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నాగ సురేష్ పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: పెదపారుపూడిలో గ్రంథాలయాల వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎంవాఎస్ లక్ష్మి తదతరులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. మహిళా దినోత్సవం పురస్కరించుకుని బాలికలకు రంగవల్లి పోటీలు మంగళవారం నిర్వహించారు. కైకలూరు, కలిదిండి గ్రంథాలయాల వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారులు కె.శ్రీనివాసరావు, జె.రమేష్, రాఘవులు, సాహితీవేత్త చింతపల్లి వెంకటనారాయణ, విశ్రాంత హెచ్‌ఎం పార్వతీశ్వర్, గ్రంథాలయ సిబ్బంది శ్రీలక్ష్మీ, రాంబాబు, కాశీ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా కెనరాబ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

గుడ్లవల్లేరు: అంగలూరులో కెనరాబ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ బ్యాంక్ వ్యవస్థాపకులు అమెంబల్ సుబ్బారావు పాయ్ చిత్రపటానికి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ వి.సౌమ్య ప్రియదర్శి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో కెనరాబ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించటంలో ముందు వరుసలో ఉందని కెనరా బ్యాంక్ ఉద్యోగ యూనియన్ నాయకుడు చిలుముల అభయాంజనేయ స్వామి పేర్కొన్నారు. అనంతరం ఖాతాదారులకు స్వీట్లు పంచిపెట్టారు.



సుబ్బారావు పాయ్ చిత్రపటానికి నివాళులర్పించిన మేనేజర్ సౌమ్య ప్రియదర్శి

ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ లింకేజ్ తప్పనిసరి

పామర్రు: ఆర్థిక ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు చేరాలంటే ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ లింకేజ్ తప్పనిసరి అని ఎంపీడీఓ జ్యోతి పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం కార్యక్రమం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్, పీఎంకిసాన్, రైతు భరోసా, తల్లికి వందనం, ఆడబిడ్డ సంక్షేమ నిధి, నిరుద్యోగ భృతి, గ్యాస్ రాయితీ, ఉపకార వేతనాలు , వసతి దీవెన తదితర పథకాల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందాలంటే బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అనుసంధానం తప్పనిసరి అని తెలిపారు. ఈ నమోదు కార్యక్రమం బుధ, గురువారం కూడా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం శ్రీనివాసరావు, సిబ్బంది అలేఖ్య, సుకన్య, ప్రవీణ్, త్రినేత్రి, పూజిత, సాయికృష్ణ, గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.



ఆధార్ నమోదుకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

ప్రత్యేక పూజలు

నిడుమోలు(మొవ్వ): మొవ్వ మండలం నిడుమోలులోని గంగా పార్వతీ సమేత స్వామి ఆలయంలో మంగళవారం సంకటహర చతుర్థి సందర్భంగా మహాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక పౌర్ణమి తర్వాత వచ్చిన బహుళ చవితి మంగళవారం కలిసి రావడంతో ప్రత్యేకత సంతరించుకుంది. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడికి పంచామృతాలతో, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆయనకు ప్రీతికరమైన గరికతో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సన్నిదేశ్వర స్వామికి అభి షేకాలు నిర్వహించారు. హిమ పర్వతాలలో ఉన్నట్లుగా చేసిన ప్రత్యేక అలంకారం భక్తులను ఆకట్టుకుంది.



పూజలందుకున్న స్వామివారు

మండవలిలో..

మండవల్లి: లింగాల విశ్వేశ్వర ఆలయంలో స్వామికి పంచామృతాలతో మంగళవారం అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. మండవల్లిలో కొలువైన శ్రీ భ్రమరాంభ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

స్కూల్ బస్ డ్రైవర్‌పై దాడి

పామర్రు(తోట్లవల్లూరు): స్కూల్ బస్ డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన తోట్లవల్లూరు మండలంలో మంగళవారం జరిగింది. ఉయ్యూరులోని ఓ ప్రైవేట్ స్కూల్ బస్ తోట్లవల్లూరు మండలం పెనమకూరు గ్రామానికి స్కూల్ పిల్లలను దింపేందుకువచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో అదే గ్రామంలో కుంతీదేవి ఉత్సవం జరుపుకుంటున్న స్థానికులు బస్ వెళ్లడానికి దారి ఇవ్వలేదు. దీంతో డ్రైవర్ బస్సు దిగి తనకు దారి ఇస్తే వెళ్లి పోవాలని అడిగారు. దీంతో స్థానికులు బస్సు డ్రైవర్ పై దాడి చేశారు. తనపై దాడి చేసిన వారిపై బస్‌డ్రైవర్ తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సవరణ